# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.
- ❖ నూతన కార్మిక చట్టాలు భారత అభివృద్ధి దిశలో మైలురాయిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.
- ❖ రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం అమరావతిలో మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ❖ గువాహటి వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముసిగే సమయానికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది.
- ❖ మలక్కా జలసంధి - దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడనుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు రంగంతో పాటు పౌరులందరూ కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. అందరి సమిష్టి కృషితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్రపతి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని ఈ రోజు సందర్శించారు. సాయి కుల్వంత్ హాల్‌లో బాబా మహాసమాధికి నివాళులర్పించిన అనంతరం అక్కడ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని రాష్ట్రపతి తెలిపారు. సత్యసాయి బాబా తన జీవితాన్ని సమాజ శ్రేయస్సుకే అంకితం చేశారని కొనియాడారు. 'మానవ సేవే.. మాధవ సేవ' అని బాబా ఎప్పుడూ ఉద్ఘాటించేవారని గుర్తు చేశారు. ఆయన బోధించిన నిస్వార్థ ప్రేమ, సేవా భావం నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ కొద్దిసేపటి క్రితం పాల్గొన్నారు.

====================

సత్యసాయి బాబా చాలా మందిలో పరివర్తన తెచ్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... నీటి సమస్య పరిష్కారానికి సత్యసాయి బాబా అనేక ప్రాజెక్టులు ప్రారంభించారని చెప్పారు. మానవ సేవే.. మాధవ సేవ.. అని నమ్మిన సత్యసాయి బాబా దానిని ఆచరించి చూపారని అన్నారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారని పేర్కొన్నారు. భగవాన్ సత్య సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించిందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీ సత్య సాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

నూతన కార్మిక చట్టాలు భారత అభివృద్ధి దిశలో మైలురాయిగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ఒక పోస్టు చేశారు. కొత్త కార్మిక చట్టాలతో కార్మికుల ఉద్యోగ భద్రత మరింత బలోపేతమవుతుందని, వేతనాల హామీ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం, హక్కులకు ప్రాముఖ్యత లభిస్తుందని వివరించారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణతో పాటు మహిళలకు మరింత సమానత్వం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ చరిత్రాత్మక సంస్కరణను ఆమోదించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులుగా ఈ నూతన కార్మిక చట్టాలు నిలుస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

====================

ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ ఈరోజు సమావేశమయ్యింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, రైతు జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విరామం

====================

ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈనెల 26న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రాష్ట్ర స్థాయి పల్లెపండగ 2.0 కార్యక్రమంలో పాల్గొనున్నారు. రాజోలు మండలంలోని శివకోటి సభాస్థలి ప్రాంగణం, మలికిపురం మండలంలోని హెలీప్యాడ్ నిర్మాణం, కేశనపల్లిలోని కొబ్బరి తోటల బాధిత రైతులతో ముఖాముఖి ఏర్పాట్లకు సంబంధించిన ప్రదేశాలను కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పూర్తిగా సహకరించాలని, పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

====================

ప్రకాశం జిల్లా మార్కాపురంలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాలను ఈ రోజు దృశ్య మాధ్యమ విధానంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ... ప్రజలకు మరింత వేగంగా, సౌకర్యవంతంగా న్యాయ సేవలు అందించే లక్ష్యంతో నూతన భవనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఒక వెయ్యి ప్రాంతాలలో అదనపు కోర్టు భవనాలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జి.రామకృష్ణ ప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

====================

గోవా వేదికగా జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ)లో సినిమాలతో పాటు దేశీయ సంస్కృతి కూడా కనువిందు చేస్తోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇఫీ ప్రాంగణంలోని వేదికపై కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేస్తున్నారు. భిన్నత్వంలోని ఏకత్వాన్ని, ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని ఈ ప్రదర్శనలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ రోజు హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, జమ్మూ కశ్మీర్ కు చెందిన కళాకారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

====================

గువాహటి వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు క్రికెట్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్స్ మార్‌క్రమ్ 38, రికెల్‌టన్ 35, ట్రిస్టన్ స్టబ్స్ 49, టెంబా బావుమా 41 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, సిరాజ్ ఒక్కో వికెట్ తీశారు.

====================

మలక్కా జలసంధి, దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 24 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఆ తరువాత పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ, రానున్న 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రాయలసీమ, దక్షిణకోస్తాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెంకట్రావు పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================
====================